క్లుప్తంగా

నేడు వాలీబాల్ పోటీలు

ఏటూరునాగారం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో నేడు (గురువారం) మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామపంచాయతీ నుంచి ఒక్కో వాలీబాల్ టీంను ఏటూరునాగారంకు పంపించాలని గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను కోరారు. క్రీడాకారులు తమ పేర్లను ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో గ్రామపంచాయతీ పేరు, జట్టుపేర్లను నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరి సస్పెన్షన్

ములుగు రూరల్: గోవిందరావుపేట మండలం పస్రాకు చెందిన ముద్దుబోయిన రామును కాంగ్రెస్‌పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు గ్రామకమిటీ అధ్యక్షుడు బద్దం లింగారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం పస్రాలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పస్రా సర్పంచ్‌గా గెలుపొందిన రాము కాంగ్రెస్‌పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోకుండా స్వంత నిర్ణయాలు తీసుకుంటూ ఇతర పార్టీలకు సహకరిస్తున్నట్లు నిర్ధారణ జరిగిందన్నారు. మెజారిటీ కార్యకర్తల తీర్మానం మేరకు పార్టీ నుంచి తొలగించడంతో పాటు ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, నాయకులు నాగేందర్‌రావు, వెంకటకృష్ణ, శ్రీను, సత్తిరెడ్డి, సునీత, చొప్పదండి వసంత, అలుగుబెల్లి వెంకటస్వామి, ఉత్తరయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన ఇసుక లారీ



వెంకటాపురం(కె): ఇసుక లోడ్‌తో అతివేగంలో వచ్చిన లారీ చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన మండలంలోని ఒంటిమామిడి గ్రామసమీపంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం..వాజేడు మండలం నుంచి వెంకటాపురంకు లారీ ఇసుక లోడ్‌తో అతివేగంగా వస్తుంది. బర్లగూడెం పంచాయతీ ఒంటిమామిడి గ్రామ సమీపం మూల మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుకింద చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడం, రోడ్డుపై ఇతర వాహనలు రాకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. కాగా మండలంలోని ఎదిర మూలమలుపు వద్ద మరో లారీ అదుపుతప్పి పల్టీ కొట్టింది.

ఆర్థిక సాయం



మంగపేట: మండలంలోని దోమెడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమరం లక్ష్మయ్య కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా ఆపార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ బుధవారం పరామర్శించారు. వైద్య ఖర్చులకు రూ. 3000 నగదును అందించారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి రాజుయాదవ్, ఆర్గనేజేషన్ సెక్రటరీ తిరుపతి, మండల నాయకులు సమ్మయ్య, శ్రీహరి, దోమెడ గ్రామ కమిటీ నాయకులు నర్సింహారావు, ప్రసాద్, జగన్నాధం, గౌస్‌పాష, ముత్తయ్య, సమ్మయ్య, రాంమ్మూర్తితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కాళేశ్వరం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి అదజేసినట్లు కాళేశ్వరం పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన చొల్లేటి సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల కాళేశ్వరాలయానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆలయం వద్ద సెల్‌ఫోన్ పాయింది. దీంతో సురేష్ కాళేశ్వరంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు సెల్‌ఫోన్ బాధితుడు సురేష్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు హెచ్‌ఎం అమలరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో చదివుతున్న గిరిజన విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని ఆమె కోరారు. పాఠశాలలో విద్య, పుస్తకాలు, నోట్ బుక్కులు, బ్యాగులు, స్పోర్ట్ షూస్, డ్రెస్, బెడ్ షీట్స్, బ్లాంకెట్స్, నాణ్యమైన భోజనం ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, కంప్యూటర్ శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి ఎంట్రన్స్ టెస్ట్ లేకుండా తీసుకుంటామన్నారు.

సర్వర్‌డౌన్.. దరఖాస్తులు జామ్..

- వారంరోజులైనా అందని కుల, ఆదాయం సర్టిఫికెట్లు
- బీసీ చేతివృత్తి రుణాలకు పెద్ద మొత్తంలో వచ్చిన దరఖాస్తులు
- విద్యార్థులకు తప్పని తిప్పలు



సర్టిఫికెట్ల కోసం చెట్ల కింద కూర్చొని పడిగాపులు కాస్తున్న దరఖాస్తుదారులు

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతి వృత్తిదారులను ప్రోత్సహిస్తూ అందించే లక్ష రూపాయల రుణం అర్హులకు ముప్పుతిప్పలు పేడుతోంది. రుణం పొందేందుకు కావాల్సిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు లబ్ధిదారులు మీసేవా, తహసీల్దార్ కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆదాయ ధృవీకరణ, కులధృవీకరణ, నివాసం సర్టిఫికెట్ల కోసం మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. కానీ తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ డిపార్ట్‌మెంట్ అప్లికేషన్ సైట్ ఎర్రర్ చూపేడుతూ ఓపెన్ కావడం లేదని అధికారులు తెలుపడంతో లబ్ధిదారులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు.

విద్యార్థుల అవస్థలు..

కులవృత్తి చేసుకునే వారు రుణాల కోసం దరఖాస్తులు చేసుకోగా విద్యాసంవత్సరం ప్రారభం అవడంతో విద్యార్థుల కుల, ఆదాయ, ఇతర సర్టిఫికెట్లు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. సైట్ ఎర్రర్ చూపించడంతో అధికారులు అప్రోల్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. మీసేవ నుంచి నేరుగా ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్ డిజిటల్ సైన్ చేస్తేకానీ ఆ సర్టిఫికెట్లు మంజూరు అవకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని దరఖాస్తుదారులు ఆగ్రహిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తులు చేసుకొని పదిరోజులు గడుస్తున్నా సర్టిఫికెట్లు అందించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులు రోజుల తరబడి ఎదురుచుస్తున్నారని, కాలేజీ, పాఠశాలల్లో సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ రాహుల్‌ను వివరణ కోరగా రాష్ట్రం మొత్తం ఒకేసారి ఈ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేస్తుండడంతో సర్వర్ డౌన్ అవుతుందని, రోజుకు ఒకటి, రెండు కంటే ఎక్కువ సర్టిఫికెట్లు అప్రూవల్ అవడం లేదని వివరించారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని, దరఖాస్తుదారులు సంయవనం పాటించాలని కోరారు.



రెవెన్యూ కార్యాలయంలో ఎర్రర్ చూపిస్తున్న సైట్

యాదవులంతా ఏకమవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఏటూరునాగారం: రాజకీయల్లో యాదవులకు సముచిత స్థానం లభించాలంటే అందరూ ఏకమవ్వాలని సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోరె రవి పిలుపునిచ్చారు. మండలంలోని రొయ్యూర్ గ్రామంలో ఉపసర్పంచ్ చంటి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో యాదవులు అత్యధిక శాతం ఉన్నారని అన్నారు. గతంలో రాజకీయ అభ్యర్థుల గెలుపోటముల్లో యాదవులు కీలకంగా మారారని, అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. రొయ్యూర్ గ్రామపంచాయతీలో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందిన ఘనత యాదవులకు ఉందన్నారు. ప్రభుత్వం యాదవులకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

హేమాచల క్షేత్రంలో దుకాణాల కేటాయింపు



షాపులను కేటాయిస్తున్న ఈఓ సత్యనారాయణ

మంగపేట: మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలో గిరిజనులకు, గిరిజనేతరులకు ఒక్కోటి చొప్పున పలు రకాల దుకాణాలను కేటాయించినట్లు ఈఓ సత్యనారాయణ బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాలుతూ.. హేమాచల క్షేత్రంలో దుకాణాల నిర్వాహణ కోసం ప్రతీ ఏటా వేలంపాట నిర్వహించేదని తెలిపారు. కానీ హైకోర్టు ఆదేశాల మేరకు గత కొంత కాలంగా నిలిచి పోయాయని తెలిపారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగుతున్న దృష్ట్యా గ్రామస్తుల అభిప్రాయం మేరకు కోర్టు ఆదేశాలు వచ్చే వరకు తైబజారు విధంగా ఆలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయం, హోటల్ ఏర్పాటు, బొమ్మల షాపులు ఏర్పచుకునేందుకు గ్రామస్తులు నిర్ణయించుకున్నారని అన్నారు. వారి అభిప్రాయం మేరకు కొబ్బరి కాయలు, పూజా సామాగ్రిని నల్లిబోయిన లక్ష్మణ్‌రావు, ముంద్రాతి విజయ్‌కు నెలకు రూ 7,500 చెల్లించే విధంగా అప్పగించినట్లు వెల్లడించారు. అదే విధంగా బొమ్మలు షాపు కుర్సం నర్సింహారావు, ఎంపెల్లి శ్రీనులకు నెలకు రూ 3000, హోటల్ మంకిడి శ్రావణ్‌కుమార్, మేడిశెట్టి నర్సింహారావు రూ 3000 చెల్లించే విధంగా కేటాయించినట్లు ఈఓ వెల్లడించారు.

దంత సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు స్నిగ్ధ

ఏటూరునాగారం: మండలంలోని ప్రజలు దంతసమస్య బారిన పడికుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్నిగ్ధపెచెట్టి, ఆర్‌ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆర్‌ఐటీఐ కళాశాలలో డాక్టర్ స్నిగ్ధ పెచెట్టి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది సరిగా బ్రేష్ చేసుకోకపోవడం వలన నోటి దుర్వాసన, దంతాలకు పిప్పళ్లు వస్తుంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు నోటిని శుభ్ర పర్చుకోవాలని, దాని వలన ఎలాంటి దంత సమస్యలు రాకుండా ఉంటాయని అన్నారు. విద్యార్థులు ఇంట్లోని తల్లిదండ్రులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ శిబిరానికి విద్యార్థులతో పాటు పరిసరప్రాంత ప్రజలు సుమారు 65 మంది హాజరుకాగా చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వైద్యురాలు స్నిగ్ధ వివరించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులు రిజ్వాన, వెంకటలక్ష్మి, విద్యార్థులు ఉషారాణి, సరితలను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ కుమారస్వామి, సాదిక్, మూవీస్‌కుమార్, పాపారావు, నరేశ్, విక్రమ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తిని పట్టుకున్న గ్రామస్తులు

వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లారం గ్రామంలో మంగళవారం రాత్రి ఓ వివాహం జరిగింది. ఓ వ్యక్తి చుట్టుప్రక్కల తిరుగతూ చిన్న పిల్లలను దగ్గరకు తీసుకోవడం వారితో ఆడుతూ ఉన్నాడు. గ్రామస్తులకు అనుమానం వచ్చి వెంటనే అతడిని పట్టుకుని ప్రశ్నించారు. ఎలాంటి సమాధానం ఇవ్వక పోవడంతో పిల్లలను అపహరించేందుకు వచ్చినట్లు గ్రామస్తులు భావించారు. కొంత మంది యువకులు నిలదీయగా తన పేరు సమ్మయ్య అని, మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు తెలిపారు. తనతో మరో ఇద్దరు వ్యక్తులు వచ్చారని, వారు కనిపించడం లేదని పొంతనలేని సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీస్‌లు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

అక్రమ వసూళ్లను అరికట్టాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని ఐకేపీ, జీసీసీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లర్లకు లారీల ద్వారా ధాన్యం తరలించేందుకు రైతుల నుంచి బస్తాకు రూ.10 నుంచి రూ.15 వరకు కమీషన్లు వసూళ్లు చేయడం అన్యాయమని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పార్టీ నాయకులతో కలిసి బుధవారం సందర్శించారు. ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలు లేకపోవడంతో ధాన్యం బస్తాలు ఎండలో మగ్గుతున్నాయని అన్నారు. రైతుల నుంచి లారీ యాజమానులు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం తరలింపు సమస్యను ఎమ్మెల్యే సీతక్క రాష్ట్ర మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదన్నారు. కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులు స్పందించి వెంటనే ధాన్యం తరలించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసెంబ్లీ కోర్డినేటర్ వెంకన్న, మైనారిటీ సెల్ అధ్యక్షులు అయూబ్ ఖాన్, మైనారిటీ సీనియర్ నాయకులు ఖలీల్ ఖాన్, దేవేందర్, కిసాన్ సెల్ కార్యదర్శి ప్రసాద్, పీఏసీఎస్ బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి చిన్న ఎల్లయ్య, లాలయ్య, గౌస్, మధుబాబు, సులేమాన్, శ్రీనివాస్, రియాజ్, విజయ్ కుమార్, నరేందర్, నవీన్ పాల్గొన్నారు.

ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో ఏం సాధించారని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్‌తోపాటు కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అయినప్పటికీ ముఖ్యమంత్రి ఆర్భాటాలకు పోయి 10 సంవత్సరాలు అధికార పగ్గాలు చేపట్టినట్లు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం కల్లాల్లో ఉండి రైతులు ఇబ్బందులు పడుతుంటే సమస్యలు పట్టించుకోకుండా దశాబ్ది ఉత్సవాల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలు ఎవరూ పాల్గొనటం లేదని, కేవలం అధికారులు మాత్రమే హాజరవుతున్నారన్నారు. రాష్ట్రంలో ఒకవైపు గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించక పోవడంతో సర్పంచులంతా అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని గొప్పలు చెబుతున్నారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో నాయకులు బట్టు రవి, రామకృష్ణ ,తుమ్మేటి రామ్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

ధరణి లోపం ప్రజలకు శాపం

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ లోపాలతో రైతులకు, ప్రజలకు శాపంగా మారిందని జెడ్పీటీసీ గుడాల అరుణ అన్నారు. బుధవారం ఆమె కాళేశ్వరంలో మాట్లాడుతూ.. మండలంలోని కాళేశ్వరంలో పూస్కుపలి శివారులో 23/బి సర్వే నంబర్‌లో శత్వార్ లెక్కల ప్రకారం 7.10 ఎకరాలు ఉండగా సాగులో అదే సర్వే నంబర్‌లో 9.20ఎకరాలు ఉందన్నారు. శత్వార్‌కు మించి పహాణిలో ఎక్కువగా నమోదు అయిందని తెలిపారు. అదే సర్వే నంబర్‌లో ఇనాం భూములు స్థానిక గంగాపుత్రులకు పీరీలు ఎత్తుకొని తిరిగినందుకు అప్పటి ముస్లిం మతపెద్దలు వారికి జీవనోపాధి కింద 3.20 ఎకరాల భూమిని బహూకరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వారిపేరు మీదకు భూమి మారడం లేదని, ఇనాం భూమిగా నమోదయిందని తెలిపారు. ఆ సర్వే నంబర్‌లో శత్వార్‌కు ఎక్కువగా ఉన్న భూమిని కొంత మంది అక్రమంగా పట్టాలు పొంది, పహాణి, ధరణిలో నమోదు చేశారన్నారు. వారికి రైతు బంధు కూడా వస్తుందన్నారు. అలాగే మహదేవపూర్‌లోని బట్టికొట్టులో 463, 464సర్వే నంబర్లలో శత్వార్‌కు మించి భూములు ఇతరుల పేర్ల మీద ధరణిలో పట్టాలు పొందారన్నారు. అన్నారంలో తాళ్లగడ్డ శివారులో సరస్వతీ బ్యారేజీ నిర్మాణ సమయంలో శత్వార్‌కు మించి అక్రమంగా అధికారులు, పలువురు కుమ్మక్కై పట్టాలు ఉన్నట్లు సృష్టించి ప్రభుత్వానికి విక్రయించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. సూరారంలో లక్ష్మీ శివారులో ఇదే మాదిరిగా అక్రమంగా విక్రయాలు జరిగాయన్నారు. కలెక్టర్ స్పందించి రైతులకు ధరణి కష్టాలు లేకుండా లోపాలను సరిచేయాలని, రైతులకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అక్షరాభ్యాసం



వాజేడు : అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ



ఏటూరునాగారం: అక్షరాలను దిద్దిస్తున్న ఉపాధ్యాయులు

వాజేడు: బటిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం నాగారంలో గల ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఎంఈవో వెంకటేశ్వర్లు చేపట్టారు. విద్యార్థుల తల్లి తండ్రులు బాధ్యతగా తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని సూచించారు. చిన్నవయస్సు నుంచే పాఠశాలకు పంపిస్తే చదువులో చురుకుగా ఉంటారని అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో అన్ని రకాల మౌళిక వసతులతో పాటు మంచి భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో మండల ఎఫ్‌ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ స్వరూప్ సింగ్, ప్రధానోపాధ్యాయుడు బాలాజి పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని నేతాజీనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం అక్షరభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా బడిలోచేరిన చిన్నారులకు ప్రధానోపాధ్యాయుడు అజ్మీర రవీందర్, ఉపాధ్యాయులు పలకలపై అక్షరాలను దిద్దించారు. ప్రతీ ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మక్క, హేమలత, విజయ్, భూలక్ష్మి, లక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.

మంగపేట: మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కమలాపురం, మంగపేట, తిమ్మంపేట, రాజుపేట కాంప్లెక్స్‌ల పరిధిలోని పాఠశాలల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న 66 మంది విద్యార్థులకు సామూహికంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మేనక, రవి, గడ్డం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాయప్ప, నర్సింహా, వెంకటరమణ, మధు, కేశవరావు, శారద, సుమలత, స్రవంతి, రాజు, రాజేశ్వర్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి



పూజలు నిర్వహిస్తున్న వెంకటరమణారెడ్డి



ప్రతిష్ఠాపన వేడుకల్లో గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, టీపీసీసీ సభ్యుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాలైన కమలాపూర్, రాంపూర్ గ్రామాలలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు వారు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవాలకు ఎమ్మెల్యే రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే గండ్ర వెంట జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ రఘుపతిరావు, ఎంపీపీ లావణ్య సాగర్‌రెడ్డి, సర్పంచ్‌లు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, తాటి వెంకన్న, ప్రవీణ్, బీఆర్‌ఎస్ నాయకులు, సత్యనారాయణ వెంట కాంగ్రెస్ నాయకులు తోట సంతోష్, పాలకుర్తి వెంకటస్వామి, మనోహర్‌రావు, బుర్ర స్వామి, నరసింహస్వామి, చందు, లింగయ్య, శంకర్, అంబాల శ్రీనివాస్, తోట రంజిత్, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాకేష్ పాల్గొన్నారు.

చేయూత

భూపాలపల్లి: భూపాలపల్లి పట్టణానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు, హోంగార్డు శంకర్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి క్రీడాకారులు వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని డీఎస్పీ కార్యాలయంలో అందజేశారు. డీఎస్పీ రాములు, సీఐ రాంనర్సింహారెడ్డి చేతుల మీదుగా శంకర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ కమిటీ సభ్యులు ఇస్లావత్ దేవన్, జల్ది రమేష్, తాటిపెల్లి రఘు, రాంచందర్, సంజీవరావు, వీరారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

'పల్లెప్రగతి' ఏర్పాట్లపై సమీక్ష

కాటారం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు(గురువారం) మండలంలోని గ్రామపంచాయతీల్లో నిర్వహించనున్న పల్లెప్రగతి కార్యక్రమ ఏర్పాట్లపై గ్రామాల ఇన్‌చార్జ్ అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పల్లెప్రగతి కార్యక్రమంలో నిర్వహించాల్సిన అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్‌ఐ వెంకన్న, పలు శాఖల అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

భూపాలపల్లి అర్బన్: రక్తదానం మరొకరికి ప్రాణదానమని ఐటీ మాస్టర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వాహకుడు వేముల శంకర్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని మిరాకిల్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఐటీ మాస్టర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ శంకర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో చాలా మందికి రక్తం సకాలంలో అందక చనిపోతున్నారని తెలిపారు. జిల్లాలో ఇటువంటి పరిస్థితులు రాకూడదనే ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. 10 సంవత్సరాల నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తూ ఆపదలో ఉన్న అనేక మందిని ఆదుకుంటున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరంలో 210 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఎంజీఎం బ్లడ్ బ్యాంక్‌కు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సురేందర్, కుమార్, ప్రవీణ్, మహేందర్, వైద్య బృందం డాక్టర్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

మల్హర్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన చాట్లపల్లి రాజబాబు దుక్కిటెద్దు ఉదయం పచ్చిక మేసేందుకు గ్రామ శివారుకు వెళ్లింది. పచ్చిక మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుత్‌షాక్ గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. ఎద్దు విలువ 70వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.